క్లుప్తంగా

పీహెచ్‌సీలో అన్నదానం



భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గంగాధర నెల్లూరు : జీడీ నెల్లూరు పీహెచ్‌సీలో రోగులకు సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎంవీ శ్రీధర్‌రెడ్డి అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణుల కడుపు నింపేందుకు సహకరించిన పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్, రెడ్ క్రాస్ మండల ప్రెసిడెంట్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రమణ ప్రకాష్



విజయపురం : మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ పని చేస్తున్న రమణ ప్రకాష్ సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతానని ఆయన చెప్పారు. అలాగే ప్రతి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామ సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు.

సఫాయి కర్మచారి సర్వే

నగరి: సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సఫాయి కర్మచారి సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మాన్యువల్ స్కావెంజర్స్‌గా ఉపాధి నిషేధించడం, వారి ప్రాథమిక హక్కు లను కాపాడటం, ఇన్‌శానిటరీ లెట్రిన్స్‌ను శానిటేషన్ లెట్రిన్స్‌గా మార్చడం .. అనే అంశాలపై ఈ సర్వే చేస్తున్నామని, నగరి మున్సిపల్ కా ర్యాలయంలో మాన్యువల్ స్కావెంజర్స్ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



ప్రత్యేకంగా అలంకరించిన పీర్లు

గంగాధర నెల్లూరు : స్థానిక అబ్బాస్ నగర్ కాలనీలో పీర్ల పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నా రు. కాలనీకి చెందిన షియా ముస్లింలు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అనంతరం భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

వర్ష బాధిత ప్రాంతాల పరిశీలన



బాధిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

నగరి : మండలంలో వర్ష బాధిత ప్రాంతాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరిశీలించారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ, కన్నికాపురం, కేజీ కుప్పం గ్రామాలలో వరి పంట నీట మునిగిందని రైతులందరు తప్పనిసరిగా పొలంలో వున్న నీటిని తీసివేసి 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే పంటను రక్షించుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ఎంపీడీఓ సతీష్, వ్యవసాయాధికారి రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితం దుర్భరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. సోమవారం ఆ కళాశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాసా ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో పొగాకు, మాదకద్రవ్యాల నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు లోనై జీవితం బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. ఎన్‌సీడీ కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని అన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అనేక దుష్పరిణామాలు ఉంటాయన్నారు. మత్తుకు బానిసలుగా మారితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలపై కలిగే అనర్థాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

శేష వాహనంపై ద్రౌపదీ విహారం



బకాసుర ఊరేగింపు



ద్రౌపదీదేవి సమేత శ్రీఅర్జునుడి ఊరేగింపు



అలంకరణలో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి

పుత్తూరు: ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శేష వాహనంపై ద్రౌపదీదేవి సమేత అర్జునుడు విహరించారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులిచ్చారు. స్థానిక మంచినీళ్ల గుంట నుంచి పోతురాజు రక్షకుడిగా ముందునడవగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో స్వామి అమ్మ వార్లను అభిషేకించారు. ఆ తర్వాత విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు స్థానిక హరిజన సంఘం ఆధ్వర్యంలో ద్రౌపదీదేవి సమేత అర్జునుడిని తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం 4 గంటలకు బకాసుర వధ ఘట్టాన్ని కోలాహలంగా నిర్వహించారు. రాత్రి శేష వాహన సేవ కె.విశ్వనాథంపిళ్లై కుమారుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను సాళ్వాకం వంశీకులైన ఆలయ కోవిల్‌కార్లు ఏలుమలై మొదలి, నటరాజ్ మొదలి, గోపిమొదలి, వెంకటేష్ మొదలి, పార్థసారథి మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

నగరి ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్ మంగళవారం సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉదయం 9 గంటలకు పల్లకి సేవ, సాయంత్రం 6 గంటలకు మత్స్యయంత్ర ఛేదన, అమ్మవారి కల్యాణోత్సం, రాత్రి అశ్వ వాహనంపై అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు.

వైభవంగా పట్టాభిషేక ఉత్సవం

నగరి: మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో నిర్వహిస్తున్న తిరునాళ్లలో భాగంగా సోమవారం పట్టాభిషేక ఉత్సవం, వసంతోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామిని పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. నిర్వాహకులు నటరాజన్ భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

పోషకాహార తోటలపై అవగాహన



మునగ చెట్టును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీలత

కార్వేటినగరం : మండలంలోని ఆర్‌కేవీబీపేట దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార తోటలపై అవగాహన కల్పించారు. రాస్– కృషి విజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పోషకాలు అందించే కూరగాయలు, ఆకుకూరల తోటల పెంపకం చేపట్టాలన్నారు. ఉత్పత్తులను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయిలో గ్రామీణులకు ఈ తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉన్న మునగ చెట్టును పరిశీలించారు. మునగా ఆకును ఆహారంలో తీసుకువడం వల్ల పిల్లలకు విటమిన్–సి లభిస్తుందని తెలిపారు.

సత్వరమే వినతుల పరిష్కారం

శ్రీరంగరాజపురం : వివిధ సమస్యలపై ప్రజలు అందించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ అమరనాథ్ ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కింద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మొత్తం 9 వినతుల వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా మంజూరు చేయాలని స్పష్టం చేశారు.

టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

నగరి: నగరి టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఉమాపతి, కార్యదర్శి వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.ఖాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఎస్.నాగూర్ బాషా, ఎస్ఎన్ వరదరాజులు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్. జగన్నాథం, రాజా, ట్రెజరర్‌గా కృష్ణయ్య, గౌరవ సలహాదారుగా పి.రాజేంద్రన్, సభ్యులుగా ఎం.గణేశ్, ఎస్ఎస్ హథీంబాయ్, ఎంఆర్.ధనరాజ్, కె.నటరాజ్, జగదీష్, రాధమ్మ, రేవతి, హమీద్, శేఖర్, రాజశేఖర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్షయ నిర్మూలనకే వ్యాక్సినేషన్



టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం : క్షయ వ్యాధి నిర్మూలనకే వ్యాక్సినేషన్ చేపట్టినట్లు వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని శ్రీబొమ్మరాజపురం, రాచపాళ్యెంలో సూపర్‌వైజర్ మురళి ఆధ్వర్యంలో క్షయ నిరోధక టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ 60 ఏళ్ల వారికి టీకాలు వేస్తున్నామని, సమాజంలో క్షయ రోగుల సంఖ్య తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇందిర



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మీపతి

పుత్తూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2024–25 ఏడాదికి గాను ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ తరగతులను ఎంపీపీ మునివేలు సోమవారం ప్రారంభించారు. ఎంపీడీఓ ఇందిర మాట్లాడుతూ, మూడు రోజుల శిక్షణ తరగతులను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ అంశాలపై శిక్షణలో గ్రహించిన విషయాలతో ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఈ ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్‌ఆర్‌డీ శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్ నరసింహులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

కార్వేటినగరం : పారిశుద్ధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మీపతి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రోగాల బారిన పడకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా సమష్టిగా పనిచేయాలని కోరారు. పైప్‌లైన్ల లీకేజీలు, ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే చెత్తసేకరణపై సైతం దృష్టి పెట్టాలని చెప్పారు. 14వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని చెప్పారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు పీఎస్ మణి, లోకేష్ పాల్గొన్నారు.

రేపటి లోపు స్కావెంజర్ల వివరాలు ఇవ్వండి

వెదురుకుప్పం: మండలంలోని అన్ని పంచాయతీల్లో పనిచేస్తున్న స్కావెంజర్ల వివరాలను బుధవారంలోపు తెలియజేయాలని ఈఓపీఆర్‌డీ పురుషోత్తం ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాన్యువల్ స్కావెంజర్లు, ఇన్ శానిటరీ లెట్రిన్ సమాచారాన్ని మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మొగిలీశ్వరాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్‌మస్తాన్

పాలసముద్రం : స్థానిక ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్ర, వీఓ లీడర్లకు డిజిటల్ లావాదేవీలపై సోమవారం అవగాహన కల్పించారు. ఏపీఎం ఫరీద్‌మస్తాన్ మాట్లాడుతూ డిఫాల్ట్ గ్రూపులను బలోపేతం చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఆర్థిక లావాదేవీల్లో భాగంగా పుస్తక నిర్వహణను వివరించారు. సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘ మిత్ర మురగయ్య, శోభ, మంజుల పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో నాయకులు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం సాయంత్రం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్ష, కార్యదర్శి మొగిలయ్య, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన యూటీఎఫ్ జెండాను ముఖ్యఅతిథిగా ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం 1974లో యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఉపాధ్యాయులు తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కౌన్సిలర్ సాంబశివన్, జిల్లా కార్యదర్శి సరిత, మండల కోశాధికారి మహేష్‌బాబు, పలువురు యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక గాంధీవిగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అదేవిధంగా తల్లి పేరు మీద మొక్క నాటాలని కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో రాయలసీమ జోనల్, ఎస్సీ మోర్చా సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యతిథిగా ఆ పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్ హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జయపద్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, నాయకులు శ్రీనివాసులు, దాము, షణ్ముగం పాల్గొన్నారు.

● నీటి మడుగులా రైల్వే సబ్‌వే..!



నీటితో నిండిన రైల్వే సబ్‌వే

నగరి రైల్వేస్టేషన్ వద్ద నిర్మించిన సబ్‌వేలో వర్షపు నీరు మడుగును తలపిస్తోంది. ఫలితంగా అటువైపు వెళ్లేవారికి దారి మూసుకుపోయింది. ఈ మార్గంలోనే మేళపట్టు, ముడిపల్లె, రామాపురం, ఏడుగట్లు గ్రామాలకు వెళ్లాలి. అయితే జోరు వర్షానికి నీరు నిలిచిపోవడంతో అటువైపు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నీటిని వెంటనే తొలగించాల్సిన రైల్వే సిబ్బంది మోటారుకు డీజిల్ కొరత ఉందని, ఎలక్ట్రిక్ మోటారు పనిచేయడం లేదని చెబుతూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు అష్టకష్టాలు పడి ఊర్లకు చేరుకోవాల్సి వస్తోంది. –నగరి

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



ఏసుమణి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : మండలంలోని గోపిశెట్టిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మాసలామణి తల్లి నరసమ్మ(71) ఆదివారం రాత్రి కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటనే సోమవారం గ్రామానికి వెళ్లి నరసమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. మాసలామణిని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీప జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల మాజీ కన్వీనర్ ధనంజయ వర్మ, ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య, మాజీ సర్పంచ్‌లు అమీద్, అంకయ్య,ఆశీర్వాదం, ఆర్.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌పురం మండలంలో..

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లెమిట్ట దళితవాడకు చెందిన మండల కో–ఆప్షన్ మెంబర్ ఏసురత్నం భార్య ఏసుమణి (61) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఏసురత్నంను ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ డిల్లయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, నాయకులు కోటిరెడ్డిబాబు, మార్కొండయ్య, దొరస్వామి జనార్ధన్, కుప్పయ్య పాల్గొన్నారు.



నరసమ్మ మృతదేహానికి అంజలి ఘటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

భరతమాత చిత్రపటం ఆవిష్కరణ



చిత్రపటం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం : మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం భరతమాత చిత్రపటం ఆవిష్కరించారు. క్రీడా కన్వీనర్ మాండవ్య మాట్లాడుతూ రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భరతమాత చిత్రపటాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు కర్ణం గిరిబాబు, జిల్లా కార్యదర్శి విజయ్, హెచ్ఎం కేశవులు, ఉపాధ్యాయులు హరిత, గుణ పాల్గొన్నారు.

కుండపోత వర్షం

విజయపురం: మండలంలో ఆదివారం రాత్రి నుంచి ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. సుమారు 77.6 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ అనూష తెలిపారు. పంటలు, పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. బోర్లు, వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగిందని పెరిగిందని రైతులు తెలిపారు.

డబుల్ లైన్ ఏర్పాటు చేయండి



రైల్వే అధికారి శ్రీనివాస మల్లాదికి వినతిపత్రం ఇస్తున్న సొసైటీ సభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: కాట్పాడి వయా చిత్తూరు పాకాల మీదుగా తిరుపతికి డబుల్‌లైన్ ఏర్పాటు చేయాలని చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు తెలిపారు. సోమవారం సికింద్రాబాద్‌లో సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సెక్రటరీ శ్రీనివాస మల్లాదిని కలిసి విన్నవించారు. ఈ లైన్ కోసం రూ.1528 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి ఢిల్లీలోని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. వీటిపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చొరవ చూపితే సమస్య వేగంగా పరిష్కారమవుతుందని సొసైటీ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు సత్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు

- 16 నుంచి జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు
- అధికారుల సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులకు రెవెన్యూ యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 45 రోజుల పాటు జిల్లాలో ఏ గ్రామంలో ఏ తేదీల్లో సదస్సులు నిర్వహించాలనే ప్రణాళికను సిద్ధం చేసి కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ప్రధానంగా మ్యూటేషన్, వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్‌లు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వీటిని పరిష్కరించడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని చెప్పారు. సదస్సుల్లో రెవెన్యూ రికార్డులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి తహసీల్దార్ ప్రాథమికంగా తమ పరిధిలో ఏ గ్రామంలో ఎక్కువ రెవెన్యూ సమస్యలు వస్తాయనే నిర్ధారణకు వచ్చేందుకు గత ఆరు నెలల అర్జీలు పరిశీలించాలని సూచించారు.

ప్రత్యేక దృష్టితో పనిచేయాలి

రెవెన్యూ సదస్సుల నిర్వహణలో తహసీల్దార్లు ప్రత్యేక దృష్టితో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా సదస్సుల్లో మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీశాఖల అధికారులు పాల్గొనాలని స్పష్టం చేశారు. ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌తో పాటు ఆర్డీఓలు సదస్సులను పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. పెద్ద డివిజన్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఏ సమస్యకైనా నిర్ణీత గడువులోపు పరిశీలిస్తామని నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆగస్టు 15న లాంఛనంగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ పుల్లయ్య, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2లోపు డిజిటలైజేషన్

అన్ని సహకార సంఘాల సంఘాలు అక్టోబర్ 2 లోపు డిజిటలైజేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓ, సహకార శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సహకార సంఘాల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఈకేవైసీ నమోదును రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీసీఈఓ సీఈఓ మనోహర్ గౌడ్, జిల్లా సహకార శాఖ అధికారి నాగవర్ధిని, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.